సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ၊ 27 ၊ మే ၊ 2023



త్వరలో కలప సేకరణ

జిల్లాలో వీఎస్‌ఎస్ సభ్యులతో త్వరలో కలప సేకరించనున్నామని, ప్రాథమిక అంచనాల మేరకు 1.70 లక్షల టన్నుల కలప వస్తుందని డీఎఫ్‌ఓ ఎ.చంద్రశేఖర్ తెలిపారు. 10లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.61,990
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,567
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,734
నవర (8 గ్రా) -	రూ.45,872

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /30.9

శుక్రవారం గాలిలో 61 శాతం తేమ ఉంది. శనివారం ఉష్ణోగ్రతలు, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్



వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): నగరంలోని పొదలకూరురోడ్డు గౌతమ్‌నగర్‌లో ఉన్న హరిత వృద్ధాశ్రమాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్ శుక్రవారం సందర్శించారు. అక్కడ వృద్ధుల యోగక్షేమాలు, వారికి అందిస్తున్న సేవలను ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ నిర్వహణకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? దాతలు ఎవరైనా సహాయం చేస్తున్నారా అని నిర్వాహకులను అడిగారు. ఆశ్రమంలో 25 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారని, వారికి నాణ్యమైన ఆహారం, మందులు అందిస్తున్నామని నిర్వాహకురాలు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అక్బర్ అలీ ఉన్నారు.

సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం: ఎస్పీ



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని డీపీవో అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళా పోలీసుల బదిలీల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు: డీపీఓ



వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీపీఓ సుస్మితారెడ్డి డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన వెబెక్స్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. భూగర్భజలాలు, మంచినీటి స్కీమ్‌లు, బోర్లు, అందుబాటులో ఉండే మంచినీటి వనరులు తదితర పూర్తి వివరాలు అందజేయాలన్నారు. అవసరమైన ప్రాంతాలకు రవాణా ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు.

నెల్లూరు నుంచి తిరుపతికి త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు



నెల్లూరు సిటీ: నెల్లూరు–తిరుపతి ఎలక్ట్రిక్ బస్సులను వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నెల్లూరు 2వ డిపో మేనేజర్ శివకేశవయాదవ్, ఒలెక్ట్రా కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆర్టీసీ 2 డిపోలో శుక్రవారం ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఎలక్ట్రిక్ బస్సులను నెల్లూరు నుంచి తిరుపతికి నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఒలెక్ట్రా కంపెనీ మేనేజర్ సుబ్బారెడ్డి, ఆర్టీసీ డిపో సెక్యూరిటీ ఇన్‌చార్జి సబ్రుద్దీన్, సూపర్‌వైజర్ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రెడీ



సింహపురి వరి సాగుకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని జలవనరులే ఇక్కడి రైతులకు కలిసొచ్చే అంశం. సాగునీరు సమృద్ధిగా ఉండడంతో అన్నదాతలు వరిసాగుపైనే ఎక్కువగా దృష్టి సారిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అండగా ఉంటూ రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తుండడంతో ఇక సాగుకు ఎలాంటి చింతా లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరిసాగుకు దుక్కులు సిద్ధం చేసి నాట్లు వేస్తున్నారు.



నాట్లు వేస్తున్న కూలీలు

సమృద్ధిగా సాగునీరు

- వరిసాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు, పురుగుమందులు
- కేఎన్‌ఎం 1638 రకం సాగుపై అన్నదాతల ఆసక్తి



ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌లో సమృద్ధిగా ఉన్న నీరు



వరి నాట్లు వేసేందుకు దుక్కి సిద్ధం చేస్తున్న ట్రాక్టర్

సంగం: జిల్లాలోని జలవనరుల్లో సాగునీరు సమృద్ధిగా ఉంది. దీంతో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో 90 వేల హెక్టార్లలో వరిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు దుక్కులు సన్నద్ధం చేస్తున్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి(ఎంజీఆర్) సంగం బ్యారేజ్ ఆయకట్టు కింద ఎక్కువగా వరిసాగు జరగనుంది. ఈ ఖరీఫ్‌లో కేఎన్ఎం 1638, 1010, ఎంటీయూ 733 రకాల వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. గత సీజన్‌లో కొత్త రకం వంగడమైన కేఎన్ఎం 1638 రకం ఎక్కువ దిగుబడిని ఇవ్వడంతోపాటు మంచి ధర పలకడంతో ఆ రకం సాగుపై కూడా రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

ట్రాక్టర్లు.. కూలీలకు గిరాకీ

రైతులు ఒక్కసారిగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతుండడంతో గ్రామాల్లో దుక్కులు దున్నే ట్రాక్టర్లకు, నారువేత వేసే కూలీలకు గిరాకీ పెరిగింది. అలాగే రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అధికారులు నిల్వ చేస్తున్నారు. సాగుకు అవసరమైన సూచనలను కూడా ఆర్బీకేల సిబ్బంది రైతులకు అందిస్తున్నారు.

ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌లో పుష్కలంగా సాగునీరు

సంగం వద్ద నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్‌లో సాగునీరు సమృద్ధిగా ఉంది. సోమశిల నుంచి వచ్చే జలాలను ఇక్కడ నిలిపి బ్యారేజ్ ద్వారా 1.50 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ బ్యారేజ్‌లో సాగునీరు సమృద్ధిగా ఉండడంతో ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండవంటూ కర్షకులు రెట్టించిన ఉత్సాహంతో సాగు పనులు చేస్తున్నారు.

జిల్లాలో..

ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం -	90 వేల హెక్టార్లు
రైతుభరోసా కేంద్రాలు -	561
అందుబాటులో ఉన్న ఎరువులు -	64,700 టన్నులు

ఆనందంగా సాగు చేస్తున్నాం



ఖరీఫ్ సాగును ఆనందంగా ప్రారంభిస్తున్నాం. గత నాలుగేళ్లుగా సాగునీటి సమస్య లేకపోవడంతో వరి సాగు ఆదాయ వనరుగా మారింది. ఈ ఖరీఫ్ ప్రారంభానికి ముందు నుంచే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండడంతో ధైర్యంగా ఉంది.

– గుండాల భాస్కర్‌రెడ్డి, రైతు, సిద్దీపురం

నకిలీలకు ఆస్కారం లేదు



గ్రామాల్లో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలోని సిబ్బంది పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అన్నదాతలకు ఇస్తున్నారు. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇస్తుండడం వల్ల నకిలీలకు ఆస్కారం లేకుండాపోయింది.

– పులిబోయిన శ్రీహరి, రైతు, మర్రిపాడు

సరిపోయేంత సాగునీరు

ఖరీఫ్ సాగు చేసే అన్నదాతలకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. సాగునీరు సరిపోయేంత ఉంది. రైతులు సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో, రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి తీసుకోవచ్చు.

– సుధాకర్‌రాజు, జేడీ, వ్యవసాయశాఖ

1,316 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డీసీపల్లి, కలిగిరి పొగాకు వేలం కేంద్రాల్లో శుక్రవారం మొత్తం 1,316 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతుల నుంచి 863 పొగాకు బేళ్లను కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాల వల్ల 18 పొగాకు బేళ్లను తిరస్కరించామని తెలిపారు. వేలంలో 1,08,300 కిలోల పొగాకును రూ.2,16,32,000కు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కిలో పొగాకు అత్యధికంగా రూ.200, అత్యల్పంగా రూ.183 ధర పలికిందని తెలిపారు.

కలిగిరిలో 453 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 453 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 494 బేళ్లను విక్రయానికి తీసుకురాగా 453 బేళ్లను కొనుగోలు చేశారని, 41 బేళ్లను తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.165, సగటున రూ.199.50 ధర లభించింది.

సోమశిలలో 43.009 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 43.009 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 179 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నారు. జలాశయంలో 94.854 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూ.15 కోట్లు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు
- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసి ఎనలేని సహకారం అందిస్తున్నారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో రూ.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శుక్రవారం ఎంపీ ఆదాల దర్గా ప్రాంగణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి రూ.7.5 కోట్లు, దర్గా ప్రాంగణంలో మసీదు నిర్మాణానికి రూ.7.5 కోట్ల చొప్పున రూ.15 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దర్గా అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ నిధులను సిమెంటు రోడ్లు, మినార్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణంతోపాటు భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. నాలుగేళ్లుగా నిధులు మంజూరు చేయించలేని వ్యక్తి తాను సాధించిన పనిని తన ఖాతాలో వేసుకోవడం విచిత్రంగా ఉందని ఎంపీ ఆదాల పరోక్షంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను ఎద్దేవా చేశారు. బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ ఓ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అఫ్రపి సాబిరి, దర్గా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం ఖాదిరి మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తొలుత బారాషహీద్‌ల సమాధులను దర్శించుకుని ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్పొరేటర్లు యాకసిరి వాసంతి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పిండి సురేష్, సత్తార్, రియాజ్, కంతర్‌వలి, మజర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన రైల్వే మాక్‌డ్రిల్

- ప్రమాదాల సమయంలో అత్యవసర సేవలపై ప్రదర్శన
- ఆకట్టుకున్న వివిధ విభాగాల పనితీరు



మాక్‌డ్రిల్‌లో భాగంగా బోగీల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్న దృశ్యం



మాక్‌డ్రిల్ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే అధికారులు

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన రైల్వే మాక్‌డ్రిల్ చూపరులను, ప్రయాణికులను అబ్బురపరిచింది. రైలు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో ప్రయాణికుల ప్రాణాలు కాపాడడం, క్షతగాత్రులకు నిమిషాల వ్యవధిలోనే వైద్యసేవలు అందించడం, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి రైల్వే ట్రాక్‌పై అడ్డంకులు తొలగించడం తదితర అంశాలపై రైల్వే అధికారులు నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకునేలా సాగింది. ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్‌తో కలిసి విజయవాడ రైల్వే డివిజన్ సంయుక్తంగా ఈ మాక్‌డ్రిల్ నిర్వహించింది. విజయవాడ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.శ్రీకాంత్ (ఆపరేషన్స్) పర్యవేక్షణలో ఉదయం 8.20 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వివిధ అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాద సంకేతాన్ని సూచించేలా సైరన్ మోగించిన వెంటనే అత్యవసర విభాగాలైన సెల్ఫ్ ప్రొపెల్డ్ యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్, ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ బృందాలతోపాటు సుమారు 150 మంది రైల్వే ఉద్యోగులు హుటాహుటిన రంగంలోకి దిగి ప్రయాణికుల ప్రాణాలు కాపాడేలా మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైలు ప్రమాదాలు జరిగిన వెంటనే బోగీల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను కాపాడడం, స్పృహ కోల్పోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీయడంతోపాటు నిమిషాల వ్యవధిలోనే వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా డ్రిల్ నిర్వహించారు. అత్యాధునిక పరికరాల సాయంతో పడిపోయిన, ధ్వంసమైన బోగీల నుంచి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీయడం, పట్టాలపై పడిపోయిన బోగీలను పక్కకు తొలగించి రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేయడం, ప్రమాద తీవ్రతను వీలైనంత తగ్గించేలా వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో చేసిన చర్యలు ప్రశంసలందుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీబీ మనోజ్, సీనియర్ డీఎస్ఓ శ్రీనాథ్, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీఈఎన్ రమణారావు, డీఎంఈఓ సుధాకర్, వివిధ రైల్వే విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

- స్వల్ప వ్యవధిలో ముగ్గురు స్నేహితులు మృతి
- 3 రోజుల క్రితం ఒకరు, ఆ తర్వాత ఇద్దరిని బలి తీసుకున్న మృత్యువు



పి.వెంకటేశ్వర్లు



బి.నాగేశ్వరరావు



కాకు సుబ్బారావు

కందుకూరురూరల్/గుడ్లూరు: స్వల్ప వ్యవధిలో ముగ్గురు స్నేహితులు మృతిచెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. మండలంలోని మోపాడు–కొండముడుసుపాళెం గ్రామాల మధ్య మోపాడు చెరువు మలుపు వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. లారీని బైక్ ఢీకొట్టిన ఈ ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలతో బ్రెయిన్ డెడ్ అయిన పి.వెంకటేశ్వర్లును మెరుగైన చికిత్సనిమిత్తం ఒంగోలుకు అనంతరం చెన్నైకు తరలించారు. వైద్యశాలకు చేరుకోగానే పరీక్షించిన వైద్యులు పి.వెంకటేశ్వర్లు(50) అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు ఉన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

బి.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు బంధువులు అయినప్పటికీ ఎప్పుడూ స్నేహంగా ఉండేవారు. గుడ్లూరు మండలంలోని బసిరెడ్డిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా బి.నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. పి.వెంకటేశ్వర్లు గుడ్లూరులోని శ్రీచైతన్య ప్రైవేట్ పాఠశాలకు పార్టనర్‌గా ఉన్నాడు. ఎక్కడికి వెళ్లినా వారు కలిసే వెళ్లేవారు. వీరిద్దరి బంధువు, స్నేహితుడు కాకు సుబ్బారావు మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. అతని కర్మకాండలు అన్నీ దగ్గరుండి వీరే చూసుకున్నారు. సుబ్బారావు ఇన్సూరెన్స్ పనిపై గురువారం కందుకూరుకు వచ్చిన నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తిరిగి గుడ్లూరు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. గుడ్లూరు నడియాద వబజార్‌లో నివాసం ఉండే స్నేహితులు ముగ్గురు మూడు రోజుల తేడాతో మృత్యుఒడికి చేరారు. ఒకే బజారులో ముగ్గురు మృతిచెందడంతో ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది. ఆ కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



రెడ్‌క్రాస్‌లో రక్తసేకరణ గురించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యులకు సూచించారు. స్థానిక పొదలకూరురోడ్డులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్‌ను కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ఎం.హరినారాయణన్ శుక్రవారం సందర్శించారు. కలెక్టర్‌కు సర్జికల్ ఆంకాలజిస్ట్ నాగేశ్వరరావు, రేడియేషన్ థెరపిస్ట్ గీతాఉషశ్రీ, వైస్ చైర్మన్ సుధీర్ నాయుడు, మేనేజర్ జుబేర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రేడియాలజీ విభాగం, రేడియేషన్ ఎక్విప్‌మెంట్, ఓపీ విభాగాలను ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందించి రెడ్‌క్రాస్‌కు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. 2001లో ప్రారంభమైన ఈ సెంటర్‌కు ప్రస్తుతం నెల్లూరు, కడప, తిరుపతి, ప్రకాశం జిల్లాల నుంచి పేషెంట్లు వస్తున్నారని సర్జికల్ ఆంకాలజిస్ట్ నాగేశ్వరరావు కలెక్టర్‌కు తెలిపారు. ముఖ్యంగా 90 శాతం మంది పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామని, నెలకు 70 నుంచి 80 సర్జరీలు, 500 నుంచి 600 వరకు కిమోలు, 50 నుంచి 60 వరకు రేడియో థెరపీలు చేస్తున్నామని తెలిపారు. ఇద్దరు సర్జికల్ ఆంకాలజిస్ట్‌లు, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, సీనియర్ రేడియాలజిస్ట్, 14 మంది జూనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారన్నారు.

బ్లడ్‌బ్యాంక్‌ను సందర్శించిన కలెక్టర్

స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంక్‌ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రక్తసేకరణ నుంచి వాటిని భద్రపరిచే తీరు, తిరిగి పేదలకు అందించే పద్ధతిని డాక్టర్ యశోవర్ధన్ కలెక్టర్‌కు వివరించారు. నెల్లూరు బ్లడ్‌బ్యాంక్ రాష్ట్రంలో మొదటి స్థానంలో, దేశంలో రెండోస్థానంలో నిలిచిందని, బయట ప్రాంతాల ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులు రూ.1,550కు రక్తం అందిస్తే నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ రూ.1050కే అందిస్తోందని తెలిపారు. సేకరించిన రక్తం ఆపదలో ఉన్న వారికి అందించి ప్రాణాలను నిలబెట్టాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, మస్తానయ్య, కన్వీనర్ అజయ్‌బాబు, సురేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.


పూర్తి కావొచ్చిన ఫ్లైఓవర్ పనులు


రోడ్డుపై తారు వేస్తున్న సిబ్బంది


ఫ్లైఓవర్‌పై తారు స్ప్రే చేస్తున్న సిబ్బంది

మినీబైపాస్‌పై ఇక రయ్ రయ్

నెల్లూరు నగరంలోని మినీ బైపాస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంతెన పనులు దాదాపు పూర్తి కావొచ్చింది. ఇప్పటికే ఫ్లైఓవర్ నిర్మాణంలో అనేక దశలను పూర్తి చేసుకోగా, ప్రస్తుతం ప్యాచ్ వర్కులు, తారురోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇవి కూడా పూర్తయితే మినీబైపాస్‌పై ట్రాఫిక్ సమస్యలు తీరి వాహనాలు రయ్ రయ్ మంటూ దూసుకెళ్తాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టు సభ్యులు

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రగ్బీ క్రీడకు సంబంధించి జిల్లా పురుషులు, స్త్రీల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. పురుషుల జట్టుకు గండవరానికి చెందిన రామదాసు, మణి, సురేంద్ర, శ్రీకాంత్, శ్రీరాజ్, శ్రీశాంత్, కార్తీక్, సుమంత్, వంశీ, ఉదయగిరికి చెందిన శశికుమార్, మనోహర్, సూళ్లూరుపేటకు చెందిన హరి ఎంపికయ్యారు. మహిళల జట్టుకు రాపూరుకు చెందిన షైనీ, హనీ, హరిణి, హాసిని, గండవరానికి చెందిన శాంతవ్య, విదీషా, కొత్తూరుకు చెందిన కీర్తి, లిల్లీ, పొదలకూరుకు చెందిన శిరీష, ఝాన్సీ, ఈశ్వరి, ప్రియ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 27, 28వ తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటాయి. ఎంపికైన వారికి శరత్‌చంద్ర, ఎండోటి చైతన్య దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్, అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కోచ్ దాసరి వంశీ, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో గీత కార్మికుడి మృతి


అంకయ్య మృతదేహం

వెంకటాచలం: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కోసూరు అంకయ్య(51) గురువారం మృతిచెందాడు. పోలీసులు శుక్రవారం వెల్లడించిన వివరాల మేరకు.. అనికేపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు అంకయ్య ఈనెల 19న తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కల్లుగీసేందుకు ఈతచెట్టు ఎక్కగా, రక్తపింజరి పాము అంకయ్యను కాటువేసింది. వెంటనే అంకయ్య ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు చెప్పడంతో చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. దీనిపై అంకయ్య కుమారుడు చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అంకయ్యకు భార్య సుభాషిణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం


రామస్వామి మృతదేహం

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నగర పరిధిలోని శ్రామికనగర్ ప్రాంతానికి చెందిన అతింజేరి రామస్వామి(61) పనినిమిత్తం బైక్‌పై గురువారం మనుబోలు మండలంలోని మడమనూరు గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి రాత్రి బయలుదేరి శ్రామికనగర్‌కు వెళ్తుండగా కాకుటూరు సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రామస్వామికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. జాతీయ రహదారి పక్కనే గుంతలో పడడంతో ఎవరూ గుర్తించలేదు. శుక్రవారం ఉదయం రాకపోకలు సాగించే ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామస్వామి కుమారుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ఇంటి ముందు ఆందోళన

ముత్తుకూరు : భర్త తనతో కాపురం చేయడం లేదని ఓ భార్య శుక్రవారం ఆందోళనకు దిగింది. భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపింది. ఎస్సై శివకృష్ణారెడ్డి కథనం మేరకు.. తోటపల్లి గూడూరు మండలంలోని వరకవిపూడికి చెందిన ప్రవల్లికకు స్థానిక నక్కలమిట్ట కాలనీకి చెందిన నాగకృష్ణతో వివాహం జరిగింది. ఇటీవల ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, భర్త ఎంతకూ తనతో కాపురం చేయకపోవడంతో బిడ్డను తీసుకొని, నక్కలమిట్టలోని భర్త ఇంటికి వచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్సై శివకృష్ణారెడ్డి ఘటన స్థలానికి వచ్చి, కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తీసుకుపోయారు. కొద్దిరోజుల క్రితం నాగకృష్ణ తీరుపై ప్రవల్లిక నెల్లూరులోని దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఉలవపాడులో భారీ వర్షం

ఉలవపాడు: మండల పరిధిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం పడింది. దీంతో 48 మి.మీ వర్షపాతం నమోదైంది. వేడిగాలులు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. గాలుల ధాటికి మామిడి కాయలు స్వల్పంగా రాలాయి. కాయల నాణ్యత దెబ్బతింటుందని రైతులు తెలిపారు. భారీ వర్షం కారణంగా దాదాపు 3 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	:రూ.55
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.15

సమస్యల పరిష్కారమే లక్ష్యం


సర్వేపల్లిలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం, సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని నాగంబొట్లకండ్రిగ, లింగంగుంట, ముత్యాలగుంట, కొర్లపాడు సంగం గ్రామాల్లో శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.5.65 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, సైడు కాలువలు, శ్మశానవాటిక అభివృద్ధి పనులను మంత్రి కాకాణి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ జరగని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. ఒక్క సర్వేపల్లి పంచాయతీలోనే రూ.5.65 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, గతంలో ఏ ప్రభుత్వంలోనైనా ఇలా సాధ్యమైందా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా మట్టి రోడ్డు కనిపించని విధంగా సీసీరోడ్లు నిర్మిస్తున్నామని తెలియజేశారు. అలాగే సైడు కాలువలు, తాగునీటి పథకాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించామన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇళ్లు లేని ప్రతిఒక్కరికీ స్థలంతో పాటుగా, ఇళ్లను మంజూరు చేసి నిర్మిస్తామన్నారు. ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు కాకుండా అదనంగా రూ.15 వేల నగదు తాను ఇస్తానని, అర్హులందరూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సర్వేపల్లితో ముగుస్తుందని, ఇది విజయవంతంగా జరిగేలా కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఆదివారం సర్వేపల్లిలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ట్రాన్స్ కో, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వీఎస్‌ఎస్ సభ్యులతో కలప సేకరణ


మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

- 1.70 లక్షల టన్నుల కలప లభ్యతకు అంచనా
- డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

ఆత్మకూరు : జిల్లాలో 761 వీఎస్‌ఎస్(వన సంరక్షణ సమితి) సభ్యులతో త్వరలో కలప సేకరించనున్నామని, ప్రాథమికంగా 1.70 లక్షల టన్నుల కలప వస్తుందని అంచనా వేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ తెలిపారు. ఆత్మకూరు అటవీ శాఖ రేంజర్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని 37 వీఎస్‌ఎస్ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దశాబ్ద కాలం క్రితం వీఎస్‌ఎస్‌ల ద్వారా కలప సేకరణ జరిగిందని, అప్పట్లోనే కొన్ని హెక్టార్లలో కలప సేకరించలేదని, అనంతరం వేసిన నూతన వీఎస్‌ఎస్‌లు సైతం పలు కారణాలతో కటింగ్ జరపలేదన్నారు. ఎట్టకేలకు రాష్ట్ర అధికారుల అనుమతులతో జిల్లా వ్యాప్తంగా కలప సేకరణ ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. టన్ను రూ.3,460 చొప్పున కొనుగోలు చేసేందుకు టెండరు పాడుకున్నారన్నారు. వీఎస్‌ఎస్ కమిటీ సభ్యులు కలప కొట్టడం మొదలు, జాగ్రత్త పరిచి పాటదారునికి అప్పగించే వరకు బాధ్యత వహించాలని సూచించారు. 2013లో చివరిసారిగా కలప సేకరణ జరిగిందని గుర్తుచేశారు. అప్పట్లో హెక్టారుకు 2,222 మొక్కల చొప్పున నాటారని, వాటిని వీఎస్‌ఎస్ సభ్యులు కాపాడి పెంచినట్లు తెలిపారు. కాగా మొత్తం మీద 20 శాతం కలప నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశామన్నారు. కలప సేకరణ అనంతరం వీఎస్‌ఎస్ సభ్యుల కష్టానికి తగ్గ ఫలితం రానుందన్నారు. వీఎస్‌ఎస్ పరిధిలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించనున్నామని, జిల్లాలో 281 గ్రామాలు అటవీ సమీపంలో ఉన్నాయని తెలియజేశారు. గతంతో పోలిస్తే అడవుల్లో అగ్ని ప్రమాదాలు తగ్గాయని, వీఎస్‌ఎస్ సభ్యుల కృషి ఎంతో ఉందన్నారు. ఆత్మకూరు రేంజ్ పరిధిలో 20 వేల టన్నుల కలప రానుందని అంచనా వేసినట్లు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేలా వీఎస్‌ఎస్ సభ్యులు తమ వంతు కృషి చేయాలని, ప్రకృతిని కాపాడేలా ప్లాస్టిక్ రహిత గ్రామాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓతో పాటు సబ్ డీఎఫ్‌ఓ రాజశేఖర్, రేంజర్ కె.రామకొండారెడ్డిని సన్మానించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్వోలు పిచ్చిరెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, ఏఎస్‌పేట, తదితర మండలాలకు చెందిన వీఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చ కోటకు బీటలు


పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరులో టీడీపీని వీడుతున్న సీనియర్లు

కోవూరు : గత సార్వత్రిక ఎన్నికలతో కుదేలైన టీడీపీ.. స్థానిక సంస్థల ఎన్నికలతో క్షేత్రస్థాయిలో తుడిచిపెట్టుకుపోయింది. గడిచిన నాలుగేళ్లుగా ఆ పార్టీని బతికించడానికి పచ్చ మీడియా జాకీలు పెట్టి లేపుతున్నా.. లోకేశ్ పాదయాత్ర చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజాదరణ కనిపించకపోవడంతో పార్టీ సీనియర్లు సైతం తమ భవిష్యత్‌ను వెతుక్కుంటున్నారు. కొడవలూరు మండలం గండవరం గ్రామం ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆ కోటకు బీటలు వారాయి. తాజాగా టీడీపీ సీనియర్ నేత అడపాల మోహన్‌కృష్ణ తన అనుచరవర్గంతో కలిసి ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నిత్యం ప్రజల్లో ఉండే మోహన్‌కృష్ణ నియోజకవర్గంలోనే గుర్తింపు కలిగిన నేతగా ఎదిగారు. నల్లపరెడ్డి కుటుంబానికి ఎంతో సన్నిహితుడైన ఆయన నాలుగేళ్లుగా ఏ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఉండిపోయారు. ఏ పార్టీలో ఉన్నా తన మనస్సు మాత్రం వైఎస్సార్‌సీపీలోనే ఉండేదని మోహన్‌కృష్ణ చెప్పుకొచ్చారు.

మరింత మంది..

నియోజకవర్గంలో మరికొందరు సీనియర్లు సైతం తమ భవిష్యత్‌ను వెతుక్కునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజాక్షేత్రంలో టీడీపీకి ప్రజాబలం లేకపోవడంతో ఆ పార్టీ నేతలమని చెప్పుకునేందుకు కూడా నేతలు జంకుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మరికొందరు టీడీపీ సీనియర్ నేతలు వైఎస్సార్‌సీపీ బాట పట్టనున్నారు.

మందుబాబుల వీరంగం

- బస్సు అద్దాలు ధ్వంసం
- డ్రైవర్‌పై దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్) : మందుబాబులు నడిరోడ్డుపై వీరంగం సృష్టించారు. ఆర్టీసీ బస్సును నిలిపి అద్దాలు పగులగొట్టడమే కాకుండా డ్రైవర్‌పై దౌర్జన్యానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. నూజివీడు నుంచి బెంగళూరుకు వెళ్లే బస్సు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 12.50 గంటల ప్రాంతంలో నిప్పో సెంటర్‌కు చేరుకుంది. ఐదుగురు వ్యక్తులు ఫూటుగా మద్యం తాగి రోడ్డుకు అడ్డంగా నిలబడి బస్సును ఆపారు. తమచేతిలో ఉన్న కొబ్బరిబోండంతో బస్సు అద్దాలను పగులగొట్టారు. దీంతో డ్రైవర్ ఎండీ సిద్దిఖ్ కిందకు దిగి వారిని వారించే ప్రయత్నం చేయగా అతనిపై దౌర్జన్యం చేశారు. ప్రయాణికులు డ్రైవర్‌ను బస్సులోకి రమ్మని చెప్పారు. అనంతరం బస్సును డ్రైవర్ నేరుగా స్థానిక వేదాయపాళెం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. మందుబాబుల వీరంగంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం నిప్పో సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో ఒకరి డిబార్

నెల్లూరు (టౌన్) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం ఆత్మకూరు జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని అధికారులు డిబార్ చేశారు. ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్‌లో 10,228 మందికి గానూ 9,688 మంది హాజరయ్యారు. 540 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్‌కు సంబంధించి 303 మందికి గానూ 270 మంది హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్‌కు 3,124 మందికి గానూ 2,848 మంది హాజరుకాగా, 276 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 221 మందికి గానూ 191 మంది హాజరుకాగా 38 మంది గైర్హాజరయ్యారు.

ముగిసిన రెండో విడత శిక్షణ

నెల్లూరు (టౌన్) : నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్ మున్సిపల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఈనెల 22వ తేదీ నుంచి జరుగుతున్న రెండో విడత శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ ఈ శిక్షణ నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించినట్లు చెప్పారు. గణితం, తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, జనరల్ మాడ్యూల్లో శిక్షణ జరిగిందని, ప్రతి సబ్జెక్టుకు నలుగురు రీసోర్స్ పర్సన్‌ల వంతున మొత్తం 20 మంది మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించారన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల పునఃప్రారంభం అనంతరం శిక్షణాంశాలను బోధనలో అన్వయించి సత్ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు బాలాజీరావు, ఉపన్యాసకులు బోయదాస్, విజయచంద్ర, స్కూల్ హెడ్‌మాస్టర్ మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.